క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి స్పందన

నస్పూర్: నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 42లో ఇన్‌కామ్ టాక్స్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చదును చేసి కబ్జా యత్నానికి పాల్పడగా, ఈ నెల 12న 'ఆగని భూ కబ్జాలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కాగా రెవెన్యూ అధికారులు స్పందించారు. 'ఈ భూమి ప్రభుత్వ భూమి.. ఆక్రమణ దారులు శిక్షార్హులు' అని మంగళవారం బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సిబ్బంది గరిసె శేఖర్, లచ్చన్న పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు సమీపంలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వ్యక్తులను గుర్తించి వారిపై అధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకుంటారా లేక బోర్డు ఏర్పాటుతోనే సరిపెడతారా అనేది వేచి చూడాలి.

ఎన్నికల నియమావళిపై బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

జైపూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌వో)లకు ఎన్నికల నియమావళిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. చెన్నూర్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి డి.చంద్రకళ, తహసీల్దార్ వనజారెడ్డి ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు ఓటరు జాబితా తయారు విధానం, విధి నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపుల ఫారం-6, 7, 8ల భర్తీ విధానంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్‌కుమార్, ఆర్‌ఐలు తిరుపతి, అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సబ్సిడీపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్‌హెచ్‌వో అనిత

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ పాం, పండ్ల తోటలు, తీగజాతి కూరగాయల పంటల సాగు సబ్సిడీపై డీఎస్‌హెచ్‌వో అనిత రైతులకు అవగాహన కల్పించారు. సబ్సిడీని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. హెచ్‌వో కళ్యాణి, ఏఈవో సాయికృష్ణ, ఆయిల్‌పాం ఫీల్డ్ ఉద్యోగి అరుణ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

భీమారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింతగా పెంచాలని డీఈవో యాదయ్య ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని తాళ్లగూడెంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు, మెరుగైన విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

షీ టీమ్ సేవలపై అవగాహన

మంచిర్యాలక్రైం: పిల్లలు, మహిళల భద్రత, భరోసా కోసమే షీ టీమ్స్ పనిచేస్తుందని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన కల్పించారు. షీ టీమ్ ప్రాముఖ్యత, విధులు, సంబంధిత చట్టాల గురించి వివరించారు. మహిళలను వేధిస్తే వెంటనే డయల్ 100కు లేదా రామగుండం షీ టీమ్ నంబర్ 63039 23700కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్సై ఉషారాణి, కానిస్టేబుళ్లు శ్రావణ్, జ్యోతి, శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటీసులకే పరిమితం..!

మంచిర్యాల కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పలుచోట్ల ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. అధికారులు వాటిని గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. రోజులు గడుస్తున్నా యజమానులు ఆ ఇళ్లను కూల్చడం లేదు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. శిథిల భవనాల దుస్థితిపై 'సాక్షి' ఫోకస్...

సాక్షి ఫోకస్

- మంచిర్యాల కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో శిథిల భవనాలు గుర్తింపు
- రోజులు గడుస్తున్నా కూల్చని యజమానులు
- భారీ వర్షాలతో పొంచి ఉన్న ప్రమాదం

మంచిర్యాలటౌన్: వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలేందుకు అవకాశాలు ఉండడంతో, మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 26శిథిలావస్థకు చేరిన ఇళ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించి, నోటీసులు జారీ చేశారు. ఇది జరిగి నెలరోజులు గడిచినా, ఇప్పటికీ ఒక్క ఇంటిని కూడా యజమానులు గాని, అధికారులు గాని కూల్చలేదు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు కాగా, ఇప్పటికీ భారీ వర్షాలు కురవకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. మూడేళ్లుగా భారీ వర్షాలు కురిసి వరద నీరు గోదావరి, రాళ్లవాగు, తోళ్లవాగు సమీపంలోని కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. ఈ ఏడాది భారీ



మంచిర్యాల బస్టాండ్ వెనక శిథిలావస్థలో ఇల్లు

వర్షాలు కురిస్తే వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరడం, శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలేందుకు అవకాశం ఉంది. టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి, పలుమార్లు యజమానులకు చెబుతున్నా, ఇళ్లను కూల్చడం లేదు. వర్షాలు కురిసి ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా, శిథిల ఇళ్లు, భవనాలు, ప్రహరీలను కూల్చాల్సి ఉంది. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్‌లోని 8గ్రామాలు విలీనం చేసి మంచిర్యాల కార్పొరేషన్‌గా మార్చగా, విలీన గ్రామాలు, నస్పూర్‌లోనే ఎక్కువగా శిథిల భవనాలు ఉన్నాయి. పాతమంచిర్యాల, బస్టాండ్ ఏరియా, హమాలివాడ, తిలక్‌నగర్, సాయికుంట, ఏసీసీ, చున్నంబట్టి వాడ ప్రాంతాల్లోనే శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయి.

మందమర్రిలో 12 ఇళ్లు...



బురుదగూడెంలో శిథిలావస్థలో ఇల్లు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 12ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయి. ఆ ఇళ్ల యజమానులకు నెల రోజుల క్రితం నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. వెంటనే ఇళ్లు కూల్చాలని, లేకపోతే మున్సిపల్ ఆధ్వర్యంలో కూల్చితే ఖర్చులు భరించాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

శిథిల కట్టడాల గుర్తింపుతోనే సరి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న కట్టడాలను గుర్తించి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏళ్ల నుంచి మున్సిపల్ అధికారులు ఇదే తంతును అనుసరించడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా వర్షాకాలంలో ప్రమాదకరంగా తయారై పడిపోవడానికి సిద్ధంగా ఉన్న కట్టడాలను కొన్నింటిని గుర్తించి నోటీసులు అందజేసి చేతులు దులుపేసుకుంటున్నారు. ప్రమాదకరస్థితిలో ఉన్న కట్టడాలను దగ్గరుండి కూల్చివేయించడంలో అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మున్సిపాలిటీలో ఉన్న 34వార్డుల్లో ప్రస్తుతం 10కట్టడాలు శిథిలావస్థలో ఉన్నట్లు నిర్ధారించి వాటిలో 6కట్టడాలకు సంబంధించిన యజమానులకు నోటీసులు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. మిగితా 4 ఇళ్ల యజమానులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో, యజమానులే వాటిని కూల్చివేసినట్లు వెల్లడించారు.

కార్మికుల హక్కుల కోసం బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పనిచేయాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ సూచించారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త గనుల ఏర్పాటుకు యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన గుర్తింపు సంఘం, ఆ దిశగా అడుగులు వేయటం లేదన్నారు. కార్మికులకు సొంతింటి పథకం అంటే అందరూ నమ్మారని, అయితే అది ఎన్నికల జిమ్మిక్కుగానే ఉండిపోయిందన్నారు. సింగరేణి ఆధ్వర్యంలోని సోలార్ ప్లాంట్, థర్మల్ పవర్ ప్లాంట్‌లలో సింగరేణి కార్మికులనే నియమిస్తారనుకుంటే వాటిలో కూడా కాంట్రాక్ట్ పద్ధతినే నియామకాలు చేపడుతున్నారన్నారు. కార్మికుల పక్షాన నిజమైన పోరాటాలు సాగించే హెచ్‌ఎంఎస్‌కు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జే.శ్రీనివాస్, పార్వతి రాజిరెడ్డి, సారయ్య, సుదర్శన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆర్కే 7 గనిపై వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. వర్షం నీరు, మురుగు నీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, రక్షణాధికారి సంతోశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కాసిపేట 1, 2గనుల్లో కొంతకాలంగా విధులకు గైర్హాజరైన కార్మికులకు మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్ విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను గైర్హాజరు కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రిటైర్డ్ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలోని రిటైర్డ్ కార్మికులకు యాజమాన్యం కనీస సౌకర్యాలు కల్పించాలని సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగం చేసి అనారోగ్యానికి గురైనట్లు, సింగరేణి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలన్నారు. ఏరియాలో మిగిలిన క్వార్టర్లను కేటాయించాలని, సీపీఆర్‌ఎంఎస్ రూ.10లక్షలు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వెల్ది వీరన్న, జక్కం రాజయ్య, పోలు సంపత్, ఆసం కొమురయ్య, నాయిని శంకర్, బచ్చలి భీమయ్య, గట్టయ్య, దేవదానం, బాగ్యరావు, రాజమౌళి ఉన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని రజకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేశ్ అన్నారు. సంఘం నాయకులతో కలిసి మంగళవారం ఆయన శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, నాయకులు శంకర్, కొండపర్తి రవి, బాపు, ప్రశాంత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

- నిరంతరం వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పోలీసులు హడలెత్తిస్తున్నారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా 30మంది ప్రత్యేక పోలీస్ బలగాలను నియమించగా, ఉదయం, సాయంత్రం ఇద్దరు ఎస్సైలు, ఒక్క సీఐ పర్యవేక్షణలో నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి 11గంటల నుంచి ఉదయం 3గంటల వరకు పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. వారి ఇళ్లలోకి వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కొరఢా ఝులిపిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రమోద్‌రావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలు, హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌లపై ఫోకస్ పెడుతున్నట్లు తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

- జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్



విద్యార్థులతో భోజనం చేస్తున్న రౌఫ్‌ఖాన్

నెన్నెల: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని జిల్లా సంక్షేమాధికారి, మండల ప్రత్యేక అధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను వెంటనే పూర్తి చేసి నీటి సౌకర్యం కల్పించి బడికి అప్పగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. రిజిష్టర్లు తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు, మెడిసిన్‌పై మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేశ్, హెచ్‌ఎం చంద్రశేఖర్, కార్యదర్శి సురేష్ ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్



మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

తాండూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సూచించారు. మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో మలేరియా ప్రబలడంతో మంగళవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. మలేరియా వ్యాప్తి చెందిన వ్యక్తి ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో స్ప్రే చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాలనీల్లో చెత్తాచెదారం తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సూరం దామోదర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెన్నెల: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది హాజరు రిజిష్టర్లను, ఓపీ రికార్డులను పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ నారాయణ, సూపర్‌వైజర్ సుశీల ఉన్నారు.

ప్రమాదం జరగకముందే పట్టించుకోండి..!



బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలో ట్యాంకు నిర్మాణం కోసం తీసిన గుంత

నస్పూర్: పట్టణ పరిధిలో ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా పలుచోట్ల భారీ హెడ్ ఓవర్ ట్యాంకుల ఏర్పాటుకు నిర్ణయించారు. బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలో, సీసీసీలోని నందనవనం పార్కు ఎదుట, ప్రొ. జయశంకర్ కాలనీ వద్ద ట్యాంకులు నిర్మించేందుకు గుంతలు తవ్వారు. కానీ కొద్దిరోజులుగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ గుంతల చుట్టూ ఎలాంటి ప్రమాద రక్షణ చర్యలు లేవు. రోడ్లకు ఆనుకొని గుంతలు ఉండడం, వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరు గుంతల్లో చేరి అటుగా వెళ్లే వాహనదారులు, బాటసారులు, చిన్నపిల్లలు అందులో పడి ప్రమాదాల భారిన పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుంతల చుట్టూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కరుణించవా.. వరుణుడా

జైపూర్: వానదేవుడా కరుణించూ.. సకాలంలో వానలు కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని జైపూర్ మండలం వేలాలలో మంగళవారం రైతులు కప్పతల్లి ఆట ఆదారు. కరుణించవా వరుణుడా.. అంటూ రైతులు గ్రామంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు దేగ నగేశ్, ప్యాగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● 'వనమహోత్సవం' విజయవంతం చేయాలి

భీమిని: వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా పశువైద్యాధికారి, కన్నెపల్లి మండల ప్రత్యేక అధికారి శంకర్ అన్నారు. గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగాగౌడ్, మధుసూదన్, పూర్ణచంద్రారెడ్డి, పున్నం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి పాఠశాల తనిఖీ

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీడీవో మదుసూదన్, ఎంఈవో గోపాల్‌రావు తనిఖీ చేశారు. రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

● కోటపల్లి ఎంపీడీవోగా నాగేశ్వర్‌రావు

కోటపల్లి: కోటపల్లి నూతన ఎంపీడీవోగా నాగేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవో అక్తర్, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, జూనియర్ అసిస్టెంట్ రాజు, సాత్విక్ పాల్గొన్నారు.

● కన్నెపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి

భీమిని: కన్నెపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

● ట్రాక్టర్ పట్టివేత

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. డ్రైవర్ మచ్చ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక, మట్టిని అనుతులు లేకుండా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఘనంగా పోలేరమ్మ బోనాల వేడుక

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీలో రెల్లి కుల సేవా సంఘం ఆధ్వర్యంలో పోలేరమ్మ బోనాల వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య భక్తులు పోలేరమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సింహాచలం, పాల్, ఈశ్వర్‌రావు, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● 49జీవో రద్దు చేయాలి

తాండూర్: జీవో నం. 49ను ఉపసంహరించుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, కొలవార్, తోటి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ జోత్స్నకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు యాపల సమ్మయ్య, గడ్డం మణికుమార్, మల్లేష్, అరికాల శంకర్, నాయిని హనుమంతు, బాపు, రాము, సురేష్ పాల్గొన్నారు.

● నల్లబ్యాడ్జీలతో నిరసన

పాతమంచిర్యాల: తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని నిరసిస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలో అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని నిర్వహించారు. 134మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు నిహారిక, సబ్ యూనిట్ అధికారి జగదీశ్, టీబీ సూపర్‌వైజర్ అశోక్, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

● ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. నాయకులు శ్రీకాంత్, రమేశ్, రవీందర్, రాజ్‌కుమార్, వినోద్, సిద్దార్థ, మనోజ్ ఉన్నారు.

● తహసీల్దార్‌కు వినతి

దండేపల్లి: ఆదివాసీ గిరిజనులను సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం దండేపల్లి తహసీల్దార్‌కు ఆదివాసీ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

● కొత్త టీపీవోను నియమించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న టీపీవో పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే కొత్త టీపీవోను నియమించాలని మంగళవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతిపత్రం అందించారు. బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, నాయకులు మతిన్‌ఖాన్, ఎస్కే రహీంబాబా ఉన్నారు.

జన్నారం చేరిన రథయాత్ర

జన్నారం: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రథయాత్ర మంగళవారం జన్నారం చేరింది. వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరుశురాం, జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లి స్వామిలకు స్థానిక నాయకులు స్వాగతం తెలిపారు.